www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 23 మార్చి 2025
5
ఏలూరు

పేదలకు వరం సిఎం సహాయ నిధి

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - ముసునూరు

అనారోగ్యపాలై ఆసుపత్రిలో చికిత్స చేయించుకోలేని పేదలకు సిఎం సహాయ నిధి ఒక వరం వంటిదని రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన పులిచర్ల గంగాధరరావు కుమారుడు శ్రీనివాసరావుకు సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.80,470 చెక్కును బాధితులకు పార్టీ మండలాధ్యక్షులు దేవినేని బలరామ్ ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఆపదలో ఉన్న ఎన్నో కుటుంబాలకు సిఎం సహాయ నిధి ఆపద్బాంధువు వలె ఆదుకుంటుందని తెలిపారు. మానవత దృక్పథంతో సిఎం చంద్రబాబు దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికీ ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నారన్నారు. బాధితులు అవసరమైన సమయంలో సిఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కొల్లేరు చిక్కుముడులు పరిష్కరిస్తున్నాం

ఆలస్యమైనా కొల్లేరు సమస్యకు నూరుశాతం పరిష్కరిస్తాం

పారిశ్రామికాభివృద్ధి, యువతకు ఉద్యోగావకాశాలే లక్ష్యం

వచ్చే ఏడాది మార్చిలోగా 7 వేల మందికి ఉద్యోగాలు

పర్యాటక ప్రదేశాలుగా కొల్లేరు, పోలవరం ప్రాజెక్టులకు ప్రతిపాదనలు

జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్

కీలకమైన సమావేశానికి ఐదుగురు ఎంఎల్‌ఎలు డుమ్మా

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పుట్టామహేష్‌కుమార్, అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరు సమస్యలో చాలా చిక్కుముడులు ఉన్నాయని, అంతా సమిష్టి కృషితో ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ వస్తున్నామని, ఆలస్యమైనప్పటికీ నూరుశాతం కొల్లేరు సమస్యను పరిష్కరిస్తామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో దిశ (జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ) సమావేశం కమిటీ ఛైర్మన్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్, చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగారోషన్‌కుమార్, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జెసి ధాత్రిరెడ్డి, జెడ్‌పి సిఇఒ కె.భీమేశ్వరరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశ అనంతరం ఎంపీ మాట్లాడుతూ కొల్లేరుకు సంబంధించి వివిధ అంశాలపై స్థానికంగా చాలా ఇబ్బందులు ఉన్నాయన్నారు. కొల్లేరు అంశం సుప్రీంకోర్టులో నడుస్తుందని, సంబంధిత సమాచారాన్ని ఇచ్చేందుకు కోర్టు కొంత సమయం ఇచ్చిందన్నారు. మానవతా దృక్పథంతో కొల్లేరు సమస్యను చూడాలని సిఎం చెప్పారన్నారు.

పరిశ్రమలు, ఉద్యోగాల కల్పనే లక్ష్యం

ఏలూరు జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి అర్హత కలిగిన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం లక్ష్యంగా పని చేయాలని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు కావల్సిన భూమికి అవసరమైన ల్యాండ్ బ్యాంకు వివరాలు అధికారులు సేకరించారన్నారు. ఏ ప్రాంతంలో ఏ పరిశ్రమ ఏర్పాటుకు అనుకూలం వంటి విషయాలతోపాటు స్కిల్ సెన్సస్ నిర్వహించి ఏ కుటుంబంలో ఉపాధి అవసరమైన వ్యక్తులు, వారి అర్హతలను తెలుసుకోవాలన్నారు. ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించడం, జాబ్‌మేళాలు నిర్వహించి, ఎక్కువ మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2026 మార్చిలోగా జిల్లాలోని ఏడు వేల మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేలా ప్రతినెలా జాబ్‌మేళాలు నిర్వహించాలని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని పరిశ్రమలు రూ.మూడు వేల కోట్లకుపైగా టర్నోవర్ కలిగి ఉన్నాయని తెలిపారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు కింద రెండు శాతం వరకు సదరు పరిశ్రమలు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ నిధులతో రైతులకు అవసరమైన వివిధ పనులతోపాటు గ్రామాల్లో ప్రజలకు అవసరమైన ఎన్నో పనులు చేపట్టవచ్చని, ఈ దిశగా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని తెలిపారు. దీనికి జిల్లాస్థాయిలో ప్రత్యేక అధికారిని నియమించి పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జల్‌జీవన్ మిషన్‌లో జిల్లాలో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వాలన్నారు. ఏలూరు, దెందులూరు నియోజకవర్గాలకు కృష్ణాకాల్వ నుండి మురుగునీరు తాగునీరుగా సరఫరా అవుతుందని, పోలవరం కుడికాలువ నుంచి పైప్‌లైన్ ద్వారా నీరందించే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఎంపీ ఆదేశించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో తొమ్మిది వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రూ.109 కోట్లతో ప్రతిపాదించిన ఉంగుటూరు, కైకలూరు రోడ్డు నిర్మాణ పనులపై చర్యలు తీసుకోవాలని, టి.నర్సాపురం-చింతలపూడి, టి..నర్సాపురం, జంగారెడ్డిగూడెం రోడ్ల నిర్మాణ పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలన్నారు. గ్రామ, మండలాల్లో చేపట్టే అభివృద్ధి పనుల వివరాలను స్థానిక ఎంఎల్‌ఎలకు తెలియజేసి, వారి సూచనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. దేశంలో 50 ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, వీటిలో మన జిల్లాలోని కొల్లేరు, పోలవరం ప్రాజెక్ట్ ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రతిపాదనలను సమర్పించాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. గతంకంటే భిన్నంగా అన్ని సమస్యలపై దిశ సమావేశంలో సంబంధిత అధికారులతో అర్థవంతమైన సమీక్ష జరిగిందన్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ భీమడోలు మండలం మల్లవరం, చెట్టున్నపాడు గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ నెల 25వ తేదీ మంగళవారం నుండి ఆగడాలలంక ఛానల్ నుండి తాగునీటి అవసరాలకు నీటిని విడుదల చేస్తామని ఇరిగేషన్ ఎస్ఇ నాగార్జున తెలిపారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, దీనిలో భాగంగా ఇప్పటికే రూ.1830 కోట్లు విలువైన 4,302 ఎకరాల ప్రభుత్వ భూమిని ల్యాండ్ బ్యాంకు ద్వారా గుర్తించామన్నారు. పారిశ్రామిక జోనల్ ప్లాన్‌ను రూపొందిస్తామన్నారు. జిల్లాలో ఏప్రిల్ పదో తేదీన జాబ్‌మేళా నిర్వహించి వెయ్యిమందికి ఉపాధి కల్పించే దిశగా ప్రణాళిక రూపొందిస్తామన్నారు.

జిల్లా పరిషత్ తీరుపై చింతమనేని ఫైర్

దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ జిల్లా పరిషత్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దెందులూరు నియోజకవర్గంలోని సమస్యలపై జిల్లా పరిషత్‌కు ప్రతిపాదనలు పంపించామని, ఎందుకు పక్కన పెట్టారంటూ సమావేశంలో నిలదీశారు. జిల్లా పరిషత్ 15వ ఫైనాన్స్ కమిషన్ నిధుల నుండి రక్షిత తాగునీటి పథకాల్లో ఫిల్టర్ బెడ్స్ మార్పు చేయాలన్నారు. తాగునీటి ఓవర్ హెడ్‌ట్యాంక్‌ల మరమ్మతుల కారణంగా ట్యాంకులను శుభ్రం చేయడం లేదని, ఓవర్‌హెడ్ ట్యాంకుల మెట్లు వంటి వాటికి మరమ్మతులు చేపడితే ట్యాంకులు శుభ్రమవుతాయన్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌కు, చింతమనేనికి మధ్య అంతరం ఉండటంతో పరోక్షంగా జెడ్‌పి ఛైర్‌పర్సన్‌పైనే ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారనే చర్చ సాగింది. జెడ్‌పి ఛైర్మన్ గంటా పద్మశ్రీ జోక్యం చేసుకుని తన వద్దకు దెందులూరు ప్రతిపాదనలు రాలేదని చెప్పారు. 2019కి ముందు తమ ప్రభుత్వ హయాంలో గ్రామ సమాఖ్య భవనాల నిర్మాణం చేపట్టామని, వాటిని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో నిర్మాణ పనులు సగంలోనే నిలిచిపోయాయని చింతమనేని తెలిపారు. వాటి వివరాలు చెప్పాలని డిఆర్‌డిఎ అధికారులను ప్రశ్నించగా పూర్తి వివరాలు ఇవ్వకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. విజ్జేశ్వరం నుంచి గోదావరి నీరు పైప్‌లైన్ల ద్వారా సరఫరా చేయాలన్న ప్రతిపాదనలకు ప్రత్యమ్నాయంగా ఏలూరు, దెందులూరు నియోజకవర్గాలకు జానంపేట వద్ద పోలవరం ప్రాజెక్ట్ కుడిప్రధాన కాల్వ నుండి గోదావరి జలాలను పైప్‌లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదించాలని చెప్పినా పట్టించుకోకపోవడం ఏమిటంటూ అధికారులను నిలదీశారు. చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరారు. పరిశ్రమలను మంజూరు చేసి నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా అభివృద్ధిపై జరిగే కీలక సమావేశానికి ఐదుగురు ఎంఎల్‌ఎలు డుమ్మా కొట్టడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది.

పాలస్తీనాపై దాడులు దారుణం

సిపిఎం రాష్ట్ర నేతలు బలరాం, సీతారాం

మాట్లాడుతున్న బి.బలరాం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పాలస్తీనా-గాజాపై ఇజ్రాయిల్ దాడులు దారుణమని, వీటిని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర నేత మంతెన సీతారాం తెలిపారు. శనివారం స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ అధ్యక్షతన సిపిఎం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో ప్రజలు, రైతాంగం, వ్యవసాయ కార్మికులు, కార్మికుల సమస్యలపై పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. ముఖ్యఅతిథులు బలరాం, సీతారాం మాట్లాడుతూ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ గాజాపై ఇజ్రాయిల్ దాడి చేయడంతో అనేక మంది పౌరులు, ముఖ్యంగా పిల్లలు, మహిళలు వందలాది మంది మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా ప్రోద్భలంతోనే ఇజ్రాయిల్ ఈ దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. వెంటనే ఈ దాడులను ఆపాలని, పాలస్తీనా ప్రజలకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలుపుతోందని అన్నారు. ఢిల్లీలో రైతాంగ సమస్యలపై పోరాడుతున్న రైతులను అణచివేసేందుకు రైతాంగ పోరాట శిబిరాలను కూల్చివేయడం అప్రజాస్వామికమన్నారు. అణచివేతలతో, నిర్భంధంతో పోరాటాలను ఆపలేరనే సత్యం చరిత్ర చెబుతోందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో పెద్దలకు రాయితీలు, పేదలకు కోతలు విధించడం అన్యాయమన్నారు. కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీకి నిధుల కేటాయింపు దారుణంగా ఉందన్నారు. రూ.2.50 లక్షల కోట్లకు బదులు రూ.83 వేల కోట్లు కేటాయించడమంటే ఉపాధి హామీని నీరుగార్చడమేనని విమర్శించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ, విద్యుత్ ఛార్జీలకు, సెకీ ఒప్పందానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన తెలుగుదేశం నేడు అధికారంలోకి వచ్చాక సెకీ ఒప్పందాన్ని రద్దు చేయకుండా కొనసాగించడమంటే అదానీ అవినీతిపై రాజీపడినట్లేనని వ్యాఖ్యానించారు. నాడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి నేడు బిగించడం టిడిపి ప్రభుత్వం రెండు నాల్కల ధోరణికి నిదర్శనమన్నారు. జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పోలవరం ప్రాజెక్టు 2025 చివరికి పూర్తి చేస్తామని ప్రకటిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆ ప్రాజెక్టు నిర్మాణానికి సర్వంత్యాగం చేస్తున్న నిర్వాసితులకు న్యాయం చేయాలనే ఆలోచన, కార్యాచరణ ప్రణాళిక లేకపోవడం అన్యాయమన్నారు. తక్షణమే నిర్వాసితులందరికీ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేసవిలో నీటి ఎద్దడి ఉండే ప్రాంతాల ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని కోరారు. జిల్లాలో 10 వారాలకు సంబంధించిన ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. కోకో, మిర్చి రైతుల వద్ద నుండి పంటను కొనుగోలు చేయాలని, వారికి గిట్టుబాటు ధర కల్పించాలని అన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు, జి.రాజు, పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్, జిల్లా నాయకులు ఎం.జీవరత్నం, ఎ.ఫ్రాన్సిస్, తెల్లం దుర్గారావు, జి.వెంకట్రావు, హనుమాన్‌లు, కారం భాస్కర్, జి.నరసింహారావు, ఎన్.రమణారావు తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై నిలదీత

వాడీవేడీగా కాగుపాడు పంచాయతీ బోర్డు సమావేశం

సర్పంచి, కార్యదర్శికి నోటీసులిచ్చిన జిల్లా ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని కాగుపాడు సర్పంచి సుంకవల్లి సుదేష్ణ అధ్యక్షతన శనివారం జరిగిన పంచాయతీ పాలకవర్గ సమావేశం వాడీవేడీగా సాగింది. పంచాయతీ నిధులను దుర్వినియోగం చేసినట్లు వార్డు సభ్యుడు వంకిన మాధవరావు అనేకమార్లు ఫిర్యాదు చేశారు. కోర్టు తీర్పుతో ఉన్నతాధికారులు విచారణ చేసి రూ.16 లక్షలకుపైగా నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించారు. దీనిపై సర్పంచితోపాటు అప్పటి పంచాయతీ కార్యదర్శి శ్రీదేవికి నోటీసులు ఇచ్చారు. ఈ క్రమంలో బోర్డు సభ్యులు పలువురు నిధుల దుర్వినియోగంపై సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దీనిపై సర్పంచి స్పందిస్తూ ఆ అంశం విచారణలో ఉందన్నారు. దీనిపై సంతృప్తి చెందని వార్డు సభ్యులు పెట్టిన ఖర్చులకు సరైన లెక్కలు, ఆధారాలు లేవని అన్నారు. పంచాయతీ నిధులను దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆందోళన వ్యక్తం చేశారు.

గోదావరి గండం ఇంకెన్నాళ్లు..!

పరిహారమిచ్చి పునరావాసం కల్పిస్తే ఖాళీ చేసి వెళ్లిపోతాం

సిపిఎం ప్రజాచైతన్య యాత్ర బృందం వద్ద పోలవరం నిర్వాసితుల ఆవేదన

నేతలతో మాట్లాడుతున్న నిర్వాసితులు

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

ప్రతియేటా గోదావరి వరదల సమయంలో దినదినగండంగా బతుకు వెళ్లదీస్తున్నామని, తమకు ఆర్‌అండ్‌ఆర్ పరిహారం, ప్యాకేజీ ఇచ్చి పునరావాసం కల్పిస్తే గ్రామాలను ఖాళీ చేసి వెళ్లిపోతామని ముంపు గ్రామాల నిర్వాసితులు వాపోయారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్ర శనివారం మండలంలోని వసంతవాడ, యర్రబోరు, పూచిరాల, చాగరపల్లి, పడమటిమెట్ట గ్రామాల మీదుగా సాగింది. బృందం వద్ద నిర్వాసితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ప్రతియేటా గోదావరి వరద 35 అడుగులకు వచ్చేసరికి గ్రామాలు వదిలి పునరావాస కేంద్రాలకు వెళ్లాల్సి వస్తుందని, మూడునెలల పాటు పిల్లలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కాంటూరుతో సంబంధం లేకుండా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి పునరావాస కాలనీలకు తరలించాలని కోరారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాలో నిర్వాసితులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్, జిల్లా నాయకులు మడివి దుర్గారావు, నేతలు వెంకట నరసయ్య, కారం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీసు అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ హెచ్చరించారు. విధి నిర్వహణలో ముందుండి సమస్యను పరిష్కరించే ప్రతి ఒక్క పోలీసు అధికారి, సిబ్బంది అభినందనీయులని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో నెలవారి నిర్వహించే నేర సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ పలు అంశాలపై సిబ్బందితో చర్చించారు. పలు కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న వారెంట్లపై ఆరా తీశారు. మిస్సింగ్ కేసుల నమోదు వాటిలో పురోగతి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసులను ఛేదించడంలో మెళకువలను ఆయన వారితో పంచుకున్నారు. ప్రతిఒక్కరూ ఫిర్యాదుదారులతో గౌరవ మర్యాదలతో మెలగాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో పోలీసు అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాల నివారణ కోసం బ్లాక్ స్పాట్స్ వద్ద తగ్గిన చర్యలు తీసుకుంటున్నామని, వేగ నిరోధకాలను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశామని, డ్రోన్ల సహాయంతో ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తూ ట్రాఫిక్ నియంత్రణలో ముందుకు దూసుకుపోతున్నామని చెప్పారు. గ్రామాల్లో శాంతిభద్రతలు పరిరక్షించేందుకు గ్రామ కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలో ఉన్న దేవాలయాలు, రద్దీ ప్రదేశాలు, అపార్టమెంట్లు వంటి వాటి వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. పర్యావరణానికి ముప్పు తెచ్చే చికెన్ వ్యర్థాల రవాణాను అరికట్టి వాటి యజమానులపై కేసులను నమోదు చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను సరైన సమయంలో పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం చేయాలని సూచించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల ఎంఎల్‌సి ఎన్నికల్లో సేవలందించిన పోలీసులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు, ఎఆర్ అదనపు ఎస్‌పి శేఖర్, ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, జంగారెడ్డిగూడెం డిఎస్‌పి యు.రవిచంద్ర, డిటిసి డిఎస్‌పి ప్రసాదరావు, ఎస్ఐబి సిఐ మల్లేశ్వరరావు, బిసిఆర్‌బి సిఐ హబీబ్‌భాషా, సిఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ కాలనీకి రక్షిత తాగునీరందించాలి

సిపిఎం ఆధ్వర్యాన వినతి

వినతి అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - చింతలపూడి

వైఎస్‌ఆర్ కాలనీ ప్రారంభించి 18 సంవత్సరాలైనా కాలనీవాసులకు తాగునీరు సరఫరా చేయకపోవడం శోచనీయమని సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్.సూర్యకుమార్ అన్నారు. పాలకుల నిర్లక్ష్య, వివక్షపూరిత వైఖరికి ఇది నిదర్శనమని విమర్శించారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో వచ్చిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం మున్సిపల్ కమిషనర్ పావనికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ పి.పాండురంగారావు, రామిశెట్టి సత్యనారాయణ, ఎం.వరలక్ష్మిదేవి, కె.అనురాధ, ఆర్.ధర్మారావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో ఘనంగా ఎటర్నాక్స్-25

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటిలో నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఎటర్నాక్స్-25 పేరిట పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమం నూతన ఆవిష్కరణలకు వేదికగా నిలవనుంది. పూర్వ విద్యార్థులు తమ మధురమైన కాలేజీ జ్ఞాపకాలను పున్ణస్మరించుకుంటూ తమ అనుభవాలను పంచుకున్నారు. ముఖ్య అతిథులుగా నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు డైరెక్టర్లు హాజరయ్యారు. శ్రీకాకుళం డైరెక్టర్ బాలాజీ పూర్వ విద్యార్థుల రీయూనియన్ కార్యక్రమంలో పాల్గొనడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఒంగోలు డైరెక్టర్ డాక్టర్ భాస్కర్ పటేల్ మాట్లాడుతూ నెట్‌వర్కింగ్ లేకుండా పూర్తిస్థాయిలో పని చేయడం సాధ్యపడదని సూచించారు. పూర్వ విద్యార్థులు తమ జూనియర్లతో ముడిపడి, వారికి మెంటర్స్‌గా మారాలని ఆయన కోరారు. నూజివీడు డైరెక్టర్ ఆచార్య అమరేంద్ర మాట్లాడుతూ పూర్వ విద్యార్థులే రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయానికి బలమని తెలిపారు. భవిష్యత్తులో నూజివీడు క్యాంపస్ తరపున హైదరాబాద్, బెంగళూరు చాప్టర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కోకో గింజలు కొనుగోలు చేయాలి

24, 25 తేదీల్లో ధర్నాలు, రాస్తారోకోలు

కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, శ్రీనివాస్

మాట్లాడుతున్న కోకో రైతుల సంఘం నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కోకో గింజలు కొనుగోలు చేయాలని, అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24, 25 తేదీల్లో మండలాల్లో నిర్వహించే ధర్నాలు, రాస్తారోకోలో కోకో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని చొదిమెళ్లలో కోకో రైతుల సంఘం నాయకులు శనివారం పర్యటించి కోకో రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ధర్నాలు, రాస్తారోకో కార్యక్రమాలు జయప్రదం చేయాలని కోరుతూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొల్లు రామకృష్ణ, కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కోకో గింజల కొనుగోలు, ధర సమస్యలపై ఉద్యాన శాఖ రాష్ట్ర డైరెక్టర్ సమక్షంలో చర్చలు జరిగినా కోకో రైతులకు న్యాయం జరగలేదన్నారు. రోజురోజుకూ ధర తగ్గించి వేయడంతో కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు అమలు చేయని నాణ్యతా ప్రమాణాలు ముందుకు తీసుకొచ్చి కోకో రైతులను కంపెనీలు మోసగించడం దారుణమని విమర్శించారు. అన్ సీజన్ కోకో గింజలు కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని కోకో గింజల కొనుగోలు, ధర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపజేసి కోకో రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోకో రైతు సంఘం నాయకులు కోనేరు సతీష్ బాబు, పి.నాని, పి.సుధాకర్, పలువురు కోకో రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం.. ప్రజలకు ప్రాణాంతకం..!

రెండు జిల్లాల్లోనూ కొన్ని పట్టణాల్లో ఈగల్, డ్రగ్స్ కంట్రోల్, పోలీసు విభాగాల ఆధ్వర్యాన మందుల దుకాణాల్లో నిర్వహించిన దాడుల్లో విస్మయపర్చే అంశాలు వెలుగులోకొచ్చాయి. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా పాలకులు, అధికార వ్యవస్థలు ఏం చేస్తున్నాయనే ప్రశ్న అందరినీ వేధిస్తోంది. ఇక ప్రజా ఉద్యమాల రథసారథి సిపిఎం ప్రజాచైతన్య యాత్రల బృందాలకు జనం ఇస్తున్న వినతులు నెలకొన్న అపరిష్కృత సమస్యలకు ప్రతిబింబంగా చెప్పుకోవచ్చు.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఏకకాలంలో పలు పట్టణాల్లోని మందుల దుకాణాల్లో సంబంధిత అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా నిషేధిత మందులు విక్రయించడం ఒక ఆందోళనకర అంశమైతే, కాలం చెల్లిన మందులను యథేచ్ఛగా వినియోగదారులకు నిర్వాహకులు విక్రయిస్తుండటం అత్యంత ప్రమాదకర అంశంగా తెరపైకి వచ్చింది. గ్రామాల్లో అయితే రోజువారీ కూలీలు, ఇతర పేదలు మందుల దుకాణాల వారు ఇచ్చిన మందులే వాడుతుంటారు. పట్టణాల్లోనే యథేచ్ఛగా కాలం చెల్లిన మందులు వాడుతున్నారంటే ఇది కేవలం మందుల దుకాణాల యజమానుల బరి తెగింపుగానే చూడలేం. సంబంధిత అధికారుల అండ, అవినీతి ప్రధాన కారణమని ప్రచారం సాగుతోంది. కాలం చెల్లిన మందులు వాడటం వల్ల రోగం తగ్గకపోగా మరిన్ని సమస్యలు ఉత్పన్నమ వుతాయని వైద్యులు చెబుతు న్నారు. మరి అటువంటి మందులు విక్రయి స్తూ ప్రజల ప్రాణా లతో చెలగాట మాడు తున్న వారిపై తూతూమంత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపు కోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఆయా మందుల దుకాణాల నిర్వాహకులకు అనుమ తులు రద్దు చేయడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక నిషేధిత మందులు ప్రధా నంగా మత్తు మందులు, ఇంజెక్షన్లు ఎటువంటి ప్రిస్కిప్షన్ లేకుండా విచ్చలవిడిగా విక్రయిస్తుండటం ఆందోళన కల్గించే విషయమే. జిల్లాలో నకిలీ మందుల రాకెట్ కార్యకలాపాలు పెద్దఎత్తున సాగుతున్నాయనే ప్రచారం సాగుతోంది. దీనికి రాజకీయ ప్రముఖుల అండదండలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వదిలేసి తమ జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా నకిలీ, కాలం చెల్లిన మందుల విక్రయదారులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపకపోతే ప్రజల ప్రాణాలకు ప్రమాదమని పలువురు హెచ్చరిస్తున్నారు.



సిపిఎం ఆధ్వర్యాన ప్రజాచైతన్య యాత్రలు రెండు జిల్లాల్లో పెద్దఎత్తున సాగుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో సైకిల్ యాత్ర అత్యంత ఉత్సాహంగా సాగి గత సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నాతో ముగిసింది. ప్రధానంగా సొంత గూడు కోసం జనం ఏస్థాయిలో ఇబ్బందులు పడుతున్నారో సైకిల్ యాత్రకు వెల్లువెత్తిన వినతులు చెప్పకనే చెబుతు న్నాయి. అధికారులు సైతం ఈ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించడం సిపిఎం విజయంగా చెప్పొ చ్చు. ఇక ఏలూరు జిల్లాలో ఆయా ప్రాంతాల వారీగా యాత్రలు పెద్దఎత్తున సాగుతున్నాయి. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి ఈ యాత్రల సందర్భంగా మరోసారి తేటతెల్లమైంది. పోలవ రం నిర్వాసితులు, జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం, చింతలపూడి, దెందులూరు తదితర ప్రాంతాల్లో భూసమస్యలు జనాన్ని పట్టిపీడిస్తున్నాయి. ఇక విద్య, వైద్యం, రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు వంటి సమస్యపై వినతులు కోకొల్లలుగా వస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటే ప్రజాపాలన సాగుతున్నట్లు జనం భావిస్తారు. లేనిపక్షంలో ఆందోళన బాట పడతారనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

- వివిఎస్‌ఎస్‌వి.ప్రసాద్

ప్రశంసాపత్రాలు అందుకుంటున్న పోలీసులు

పోలీసులకు ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

2019లో బాలికపై జరిగిన హత్యాచార ఘటనలో నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష పడే విధంగా కృషి చేసిన సిబ్బందికి ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ప్రశంసాపత్రాలను అందించారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన నెలవారి నేర సమీక్ష సమావేశం అనంతరం సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు. జీలకర్రగూడెం మండలం గుంటుపల్లి గుహలకు 2019లో తన స్నేహితుడితో కలిసి వెళ్లిన బాలిక హత్యాచారానికి గురైంది. నిందితులను పోలీసులు వేగంగా అరెస్టు చేశారు. ఆధారాలను న్యాయస్థానానికి సమర్పించడంతో ఈ కేసులో ఉన్న నలుగురు నిందితులకు న్యాయమూర్తి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా ఈ కేసులో సహకరించిన ప్రతి ఒక్క పోలీసు సిబ్బందిని ఎస్‌పి అభినందించి వారికి ప్రశంసాపత్రాలు అందించారు. జంగారెడ్డిగూడెం డిఎస్‌పి యు.రవిచంద్ర, భీమడోలు సిఐ విల్సన్, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుబ్బారావు, తడకలపూడి ఎస్ఐ చెన్నారావు ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

ప్రజాశక్తి - చింతలపూడి

నేటి సమాజంలో చిన్నారులు విద్యార్థి దశ నుంచే లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారని మండల లీగల్ సర్వీస్ కమిటీ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు అన్నారు. శనివారం ఆయన బాలికల హాస్టల్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పోక్సో చట్టం, గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు మాట్లాడుతూ చిన్నారుల ప్రాథమిక హక్కులకు భంగం కలుగకుండా ప్రభుత్వం పోక్సో చట్టం తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ లాయర్ పిఎల్‌వి, పోలీస్ సిబ్బంది, హాస్టల్ వార్డెన్, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ప్రాణాలు కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి యువకుడి ప్రాణాలను కాపాడారు. మండలంలోని చెక్కపల్లి గ్రామానికి చెందిన ఒక యువకుడు శుక్రవారం రాత్రి ఇంట్లో గొడవపడి ఇంటి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు 112 కాల్ చేసి విషయం తెలిపారు. వెంటనే స్పందించిన ముసునూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది చెక్కపల్లి గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులతో, వారి బంధువులతో మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సెల్‌ఫోన్ ఆధారంగా యువకుడు చెక్కపల్లి గ్రామంలోని మొకజొన్న తోటలో ఉన్నట్లు గుర్తించారు. మానసిక వేదనతో అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న ఆ యువకుడిని ఆసుపత్రికి తరలించి అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. దీంతో యువకుడి కుటుంబసభ్యులు, గ్రామస్తులు ముసునూరు ఎస్ఐ చిరంజీవిని, సిబ్బందిని అభినందించారు.

సమస్యల పరిష్కారం కోసం 24న నిరసన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకంలో గత 17 ఏళ్లుగా ఉన్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24వ తేదీన అన్ని జిల్లాల్లోని సమన్వయకర్త కార్యాలయాల వద్ద శాంతియుతంగా నిరసనలు చేయనున్నట్లు ఎపి వైద్య సేవ ఎంప్లాయిస్ వారు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా ఈ నెల 27వ తేదీన ఎన్‌టిఆర్ వైద్యసేవ ట్రస్ట్ మంగళగిరి, గుంటూరు వద్ద గాంధేయ పద్ధతుల్లో శాంతియుత నిరసన కార్యక్రమం చేయనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా సోమవారం ఏలూరులోని సర్వజన ఆసుపత్రిలో ఎన్‌టిఆర్ వైద్య సేవ కేంద్రం వద్ద నిరసన తెలియజేయనున్నట్లు తెలిపారు.

నీటి కుంటల పనులు ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని బత్తులవారిగూడెంలో సర్పంచి ముసునూరు లక్ష్మీకాంతమ్మ పంట నీటి కుంటల పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి లక్ష్మీకాంతమ్మ, గ్రామ పెద్దలు ముసునూరు రాజా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఎపిఒ బి.శ్యామ్, కార్మికులు పాల్గొన్నారు.

చింతలపూడి : మండలంలోని ప్రగడవరం పంచాయతీ మెట్టగూడెంలో పాండ్ ఇంకుడు గుంతల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ప్రగడవరం గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు కనుమత రెడ్డి రాజారెడ్డి, కెటిఆర్, బుద్దాల నాగు, కొప్పెర్ల నాగరాజు, చక్రపు మారేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడు రూరల్ : మండలంలోని రేపాకగొమ్ము, రుద్రంకోట గ్రామాల్లో ఉపాధి హామీ అధికారుల సమక్షంలో శనివారం భూమి పూజ చేసి కార్యక్రమం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శ్రీహరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

పోలవరం :మండలంలోని ప్రగడపల్లి పంచాయతీలో ఉపాధి హామీ చట్టం ఆధ్వర్యంలో పంట సంజీవని కార్యక్రమానికి శనివారం భూమి పూజ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, ఎంపిడిఒ చెరుకూరి శ్రీనివాస్‌బాబు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రగడపల్లి సర్పంచి కలుం బాపిరాజు, ఉపాధి హామీ ఎపిఒ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ గంగరాజు, ఎంపిటిసి సభ్యులు దాపర్తి మోహనరావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కునూరు :మండల పరిధిలోని లంకలపల్లిలో వ్యవసాయ ఫారం ఫండ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నర్సింహారావు, టిడిపి మండలాధ్యక్షులు నాగేశ్వరరావు, జనసేన పార్టీ మండలాధ్యక్షులు మొలిశెట్టి గంగధర్, ఉపాధి హామీ ఎపిఒ మాధవరావు, ఫీల్డ్ అసిస్టెంట్ మడకం నాగేశ్వరరావు, మాచర్ల శ్రీనివాసరావు, టిడిపి సీనియర్ నాయకులు కోటగిరి సత్యనారాయణ పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అవసరార్థులకు అందించే సాయం అత్యంత ఆనందాన్ని కలిగిస్తోందని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.1.50 కోట్ల సిఎం సహాయ నిధి చెక్కులను బాధితులకు అందించినట్లు వెల్లడించారు. ఏలూరులోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సిఎం సహాయ నిధి ద్వారా ఏలూరు నియోజవర్గంలోని 12 మంది లబ్ధిదారులకు విడుదలైన రూ.4,37,959 విలువైన చెక్కులను ఎంఎల్‌ఎ అందించారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా స్థావరాలపై దాడి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

చాట్రాయి మండలం చిత్తపూరు గ్రామంలో భారీస్థాయిలో నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అజయ్‌కుమార్‌సింగ్ తెలిపారు. 345 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, 1400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్లు తెలిపారు. అలాగే నాటు సారా తయారీకి వినియోగించే 130 కిలోల బెల్లం సీజ్ చేసినట్లు చెప్పారు. ఇద్దరు నిందితులు పోలవరం గ్రామానికి చెందిన బాలకృష్ణ, చిత్తపూరు గ్రామానికి చెందిన చలకంటి సతీష్ పరారైనట్లు చెప్పారు.

చింతలపూడి :మండలంలోని నాగిరెడ్డిగూడెంలో నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు శనివారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి95 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, 2,400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అశోక్ కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో అజయ్ కుమార్ సింగ్, సిఐలు ధనరాజ్, సత్యవతి, ఎస్ఐలు నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, జగ్గారావు పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్లు దగ్ధం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండల కేంద్రంలోని పిరాజవరం వెళ్లే రోడ్డులో ఉన్న వంటిపల్లి సౌజన్యకు చెందిన బ్యారన్, అవినాష్‌కు చెందిన రెండు వర్జీనియ్య పొగాకు బ్యారన్లు శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో అవినాష్, సౌజన్యలకు సుమారు రూ.ఎనిమిది లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ప్రభుత్వం, పొగాకు బోర్డు వారు స్పందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఈ ఏడాదీ నిరాశే..!

పెట్టుబడి ఎక్కువ.. ధర, దిగుబడి తక్కువ

మామిడి రైతుల దీనస్థితి

కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయం

ప్రజాశక్తి - చింతలపూడి

మామిడి పంట రైతులకు ఈ ఏడాది కూడా నిరాశే మిగులుతుంది. ప్రతి ఏడాది ధర తక్కువగా ఉంటే దిగుబడి ఎక్కువగా ఉంటుంది. ధర ఎక్కువగా ఉంటే దిగుబడి తక్కువగా ఉంటుంది. ఈ ఏడాది ధర, దిగుబడి రెండూ తక్కువగానే ఉన్నాయి. చెట్లకు పూత ఆలస్యంగా రావడం, వాతావరణంలో మార్పుల వల్ల రాత్రి సమయాల్లో మంచు అధికంగా కురుస్తుండడంతో పూత రాలిపోయి చెట్లకు కాయలు తక్కువగా ఉన్న పరిస్థితి నెలకొంది.

ఈ ఏడాది చాలా గ్రామాల్లో రైతులు మామిడి పంటపై ఆశలు పెట్టుకున్నారు. ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. పగటి పూట అధిక ఉష్ణోగ్రత, రాత్రి సమయంలో మంచు కురుస్తూ ఉండడంతో పూత రాలిపోతుందని, మాడిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారి పెట్టుబడి పెడితే క్రమం తప్పకుండా ఆదాయం వస్తుందని అనేక మంది రైతులు మామిడి సాగు చేస్తున్నారు. అనేక మార్లు ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది ఇప్పటికే పలుమార్లు ఎరువులను వాడారు.

మండల పరిధిలో సుమారు 800 ఎకరాల్లో మామిడి సాగు జరుగుతుంది. గతంతో పోల్చు కుంటే మెట్ట ప్రాంతంలో మామిడి పంట సాగుతో పాటు దిగుబడి కూడా తగ్గింది. పెట్టుబడులు పెట్టినా సరైన దిగు బడి రావడం లేదని కొంతమంది మామిడి తోటలను నరికి వేస్తుండగా, గతంలో లేని విధంగా కోతులు మామిడి పిందెలను నాశనం చేస్తుండటంతో వాటికి రోజు కాపలా ఉండలేక కొంత మంది మామిడి చెట్లను తీసివేస్తున్న పరిస్థితి నెలకొంది.

గతేడాది బంగినపల్లి మామిడి పండ్లు టన్ను రూ.60 వేలు ఉండగా ఈ ఏడాది ప్రస్తుతం రూ.30 వేలు ఉందని, తూత పూరి టన్ను ప్రస్తుతం రూ.20 వేలు ఉండగా గతేడాది రూ.35 వేల వరకు ధర ఉందని రైతులు చెబుతున్నారు. మామిడి తోటలు కౌలు సాగు చేసే వారి పరిస్థితి దయానియంగా ఉంది. పెట్టుబడులు ఎక్కువ అవ్వడంతో పాటు కౌలు రేట్లు కూడా పెరగడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

ధర పెరిగితే బాగుంటుంది

సుధీర్, కౌలు రైతు, యర్రగుంటపల్లి

మామిడి పంట రైతులకు ఈ ఏడాది కూడా నిరాశే మిగులుతుంది. పెట్టుబడులు, కౌలు వస్తే చాలు. ప్రస్తుతం ధర తక్కువగా ఉంది. ముందు ముందు పెరిగితే బాగుంటుంది.

బోసును హత్య చేసినవారిని అరెస్టు చేయాలి

మాజీ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెంలో ఇటీవల వైసిపి నాయకుడు గంధం బోసును హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని పోలవరం మాజీ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు డిమాండ్ చేశారు. గుర్తు తెలీని వ్యక్తుల చేతిలో మృతి చెందిన బోసు కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బోసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ బోసు మృతి పార్టీకి తీరని లోటన్నారు. హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండలాధ్యక్షులు సందా ప్రసాద్, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, బోధ శ్రీనివాస్, నాయకులు కుంజా రాముడు, సత్యనారాయణ, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

తేనెపెట్టెలు, పరికరాల పంపిణీ

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని రెడ్డికుంకాల గ్రామంలో శనివారం జివిఎస్ఎస్ (గిరిజన వికాస్ స్వచ్ఛంద సేవా సంస్థ) వారి ఆధ్వర్యంలో తేనె పెట్టెలు, పరికరాలు 31 మంది గిరిజన రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు పాల్గొని లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇలాంటి చక్కని అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కోరారు. సంస్థ డైరెక్టర్ మూర్తి మాట్లాడుతూ ఈ సంస్థ ద్వారా గిరిజనులకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఐటిడిఎ హార్టికల్చర్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎపి ఎస్‌టి సెల్ కార్యదర్శి సున్నం నాగేశ్వరరావు, పోలవరం జెడ్‌పిటిసి సభ్యులు కలుం హేమకుమారి, టిడిపి ఎస్‌టి సెల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ కుర్సం దుర్గారావు, సర్పంచి గంగాదేవి, జనసేన నాయకులు కోటం లక్ష్మణరావు, పోతురాజు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గ్రామాల్లో నాటుసారా నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జంగారెడ్డిగూడెం డివిజన్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనుకుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని నాటుసారా ప్రభావిత గ్రామాలైన ములగలంపల్లి, పి.అంకంపాలెం గ్రామాల్లో శనివారం అవగాహనా సదస్సులు ఏర్పాటు చేశారు. అనంతరం సారా నిర్మూలనకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సర్పంచి, విఆర్‌ఒ, విఆర్ఎలతో కలిసి గ్రామ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

'మంద కృష్ణమాదిగ పోరాట ఫలితమే ఎస్‌సి వర్గీకరణ'

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని శ్రీనివాస్ సెంటర్‌లో ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్‌సి వర్గీకరణ సారధి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చిత్రపటానికి ఎంఆర్‌పిఎస్ మండలాధ్యక్షులు కలపాల విలియమ్స్ ఆధ్వర్యంలో శనివారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లూరి నాగేంద్రబాబు హాజరయ్యారు. అనంతరం నాగేంద్రబాబు మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ అలుపెరగని మూడు దశాబ్దాల పోరాట ఫలితమే ఎస్‌సి వర్గీకరణ అని అన్నారు. ఎంఎఆర్‌పిఎస్ నూజివీడు నియోజకవర్గ అధ్యక్షులు దుబ్బాకు దేవరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముల్లపూడి వెంకటేశ్వరరావు, నూజివీడు మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, ఉదయగిరి కృపారావు, జమలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామీణ విశ్లేషణాత్మక సదస్సులు

భీమడోలు :వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ విశ్లేషణాత్మక సదస్సులు రైతులను చైతన్య పరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఏలూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఫణికుమార్ అన్నారు. పాతూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద శనివారం గ్రామ అవగాహన, కృషి అనుభవ కార్యక్రమం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా ఏరువాక కేంద్రం సమన్వయకర్తతో పాటు, శాస్త్రవేత్త నాగేంద్రబాబు, భీమడోలు వ్యవసాయ అధికారి ఉషారాణి, సచివాలయ వ్యవసాయ సహాయకులు షైలు భాను పాల్గొన్నారు. రైతు సేవా కేంద్రానికి వచ్చిన వ్యవసాయ శాఖ ప్రముఖులు వ్యవసాయ భూములను క్షేత్ర సందర్శన చేశారు.

నీటిని పొదుపు చేయాలి

ప్రజాశక్తి - చాట్రాయి

ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాల విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం గంపా వెంకట్రావు మాట్లాడుతూ నీటిని ఏ విధంగా పొదుపు చేసుకోవాలో విద్యార్థులకు వివరించారు.

నేడు సిపిఐ ప్రచారా జాతా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 23 నుంచి సిపిఐ ప్రచార జాతా నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య తెలిపారు. స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కృష్ణచైతన్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సిపిఐ శత వార్షికోత్సవాలను జరుపుకుంటుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పాలకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఈ నెల 23 ఆదివారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం నుంచి 36 డివిజన్ భగత్ సింగ్ విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్లి భగత్ సింగ్ వర్ధంతిని జరిపి అనంతరం నగరంలో జాతా నిర్వహిస్తామని తెలిపారు.

అపరిచితుల పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల ప్రకారం స్థానిక చొదిమెళ్లలోని అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో బాలబాలికలకు లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును ఏలూరు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.రచన, జంగారెడ్డిగూడెం రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.రాజరాజేశ్వరి తేజస్వి, పాలకొల్లు రెండో అదనపు జూనియర్ జడ్జి పివిఎస్ఎన్ఎల్.లావణ్య, తణుకు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పివిఎన్.రంజిత్‌కుమార్ సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పివిఎన్.రంజిత్‌కుమార్ మాట్లాడుతూ అపరిచితుల విషయంలో ఆడపిల్లలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి, తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్‌ఎసి) ఎం.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పెదవేగి మండలం వంగూరు ఉన్నత పాఠశాలలో జాతీయ నీటి దినోత్సవం సందర్భంగా అవగాహనా సదస్సును ఏలూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కెవి.బులికృష్ణ నిర్వహించారు. ఏలూరు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.రచన పాల్గొన్నారు.

ఫ్లయ్‌ఓవర్, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి కృషి

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణకు ఫ్లైఓవర్, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఏలూరు శాంతినగర్‌లోని ఎంపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం రైల్వే, ఎన్‌హెచ్, ఆర్‌అండ్‌బి శాఖల ఉన్నతాధికారులతో ఎంపీ మహేష్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గంలోని రైల్వే, జాతీయ రహదారులు, ఆర్‌అండ్‌బి రహదారుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని ఇప్పటికే కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేసినట్లు ఎంపీ తెలిపారు. ఇప్పటికే గుర్తించిన సమస్యలకు సంబంధించి నిధుల మంజూరు నిమిత్తం అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. జాతీయ రహదారుల్లో ప్రమాదాల నివారణకు ఫ్లైఓవర్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి వంటి అభివ ద్ధి పనులను కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు తెలిపారు. అలాగే పొగాకు రైతులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

టిడిపి శ్రేణులకు ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్ పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వేసవి తీవ్రత నేపథ్యంలో పాదచారుల దాహార్తి తీర్చడానికి ఏలూరు పార్లమెంట్ పరిధిలో చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ కేంద్రాలు విరివిగా ఏర్పాటు చేయాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. టిడిపి ఏలూరు 24వ డివిజన్ ఇన్‌ఛార్జి కడియాల విజయలక్ష్మి సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటితో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాధితుడికి 'మానవత' ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చిన్నంపేట గ్రామంలోని తీర్ధాల నాగేశ్వరశాస్త్రికి గత రెండేళ్ల నుంచి కుడిపక్క నోటిలోని దవడ ఎముకకు ఇన్ఫెక్షన్ రావడం వల్ల ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న నూజివీడు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సాయం అందించింది. సంస్థ ఛైర్మన్ పి.కృష్ణప్రసాద్, అధ్యక్షురాలు కొండపల్లి అనంతలక్ష్మి, కార్యదర్శి మాచినేని రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు ఒ.రామలింగేశ్వరరావు, కె.రంగారావు, కె.తిరుపతి రావు, ఎన్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో చిన్నంపేటలో నాగేశ్వరశాస్త్రి ఇంటికి శనివారం వెళ్లి రూ.17,115 వైద్య ఖర్చుల నిమిత్తం అందించారు. కుటుంబానికి నాలుగు నెలల సరిపడ నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో చిన్నంపేట సిద్ధార్థ స్కూల్ ప్రిన్సిపల్ పలగాని శ్రీనివాసరావు, సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం చాట్రాయి మండల కార్యదర్శి కొమ్ము ఆనందం పాల్గొన్నారు.

రూ.కోటితో దొండపాడు గ్రామాభివృద్ధి

దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని

దెందులూరు :కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో దొండపాడు గ్రామాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ చెప్పారు. ఏలూరు కార్పొరేషన్ 26వ డివిజన్ పరిధిలోని దొండపాడులో శనివారం ఉదయం స్థానిక నాయకులు, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భానుప్రతాప్ సహా పలు శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ పర్యటించారు. గ్రామంలో 450 మీటర్ల తారు రోడ్డు నిర్మాణంతో పాటు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీల నిర్మాణానికి చర్యలు చేపట్టామని, సత్వరమే అంచనాలను సిద్ధం చేసి నివేదికలు అందించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించామని తెలిపారు. అందుకోసం రూ.కోటి నిధులను కేటాయించామని తెలిపారు. దొండపాడు ప్రజలకు కేటాయించిన చొదిమెళ్ల సచివాలయం దూరం అవ్వటం వల్ల ఇబ్బంది పడుతున్నారని, వారికి స్థానిక శనివారపుపేట సచివాలయం ద్వారా పౌర సేవలు అందించేలా తక్షణమే చర్యలు చేపట్టాలని ఏలూరు మున్సిపల్ కమిషనర్‌కు సూచించినట్లు చెప్పారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం కృషి

పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రజలకు అంతరాయాలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు అన్నారు. మండలంలోని వల్లంపట్ల, పుట్రేపులో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి సేకరించిన స్థలాలను ఆయన శనివారం పరిశీలించారు. మండలంలోని తీగలపల్లిలో నిర్మాణంలో ఉన్న సబ్ స్టేషన్‌ను పరిశీలించారు. అదేవిధంగా మండలంలోని ఎపిగుంటలో ఉపాధి హామీ చట్టం ద్వారా నిర్మించనున్న ఫారమ్ పాండ్ (సేద్యపు నీటి కుంట)లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బాలరాజు మాట్లాడుతూ మండలంలో రైతుల వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడడంవల్ల ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేద్యపు నీటికుంటలో పథకాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి గడ్డమునుగు రవి, జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

ముదినేపల్లి :వేసవిలో గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండల ప్రజా పరిషత్ సమావేశపు మందిరంలో ఎంపిపి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత వివిధ శాఖల పనితీరుపై చర్చించారు. అనంతరం ఎంపిపి సత్యనారాయణ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పిహెచ్‌సి వైద్యులు వేసవిలో వృద్ధులు, పిల్లలు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులందరూ అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండలాభివృద్ధికి పాటు పడాలన్నారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు వారి పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశరమ్మ, ఎంపిడిఒ వై.రామకృష్ణ, తహశీల్దార్ సుభాని, వైస్ ఎంపిపి రాధా, షేక్ అల్లాబక్షు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి పనులు పూర్తి చేయాలని వినతి

టి.నరసాపుర :మండలంలోని బొర్రంపాలెంలో నిర్మాణదశలో నిలిచిపోయిన ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని పూర్తి చేయాలని గ్రామానికి చెందిన సామాజిక వేత్త గుండె పాండురంగ శనివారం పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. మండలంలో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణంలో భాగంగా స్థల పరిశీలనకు వచ్చిన ఎంఎల్‌ఎ బాలరాజును కలిసి గ్రామంలో నెలకొన్న పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. సచివాలయం-1, సాయినగర్ వాటార్ ట్యాంక్‌కు స్థలాల్లో ఆక్రమణలు తొలగించాలని, జిఎన్ఆర్ మెట్టపై జగనన్న హౌసింగ్ లే అవుట్‌ను రద్దు చేసి, వారికి అనువైన ప్రదేశంలో ఇవ్వాలని, వీరభద్రవరం వెళ్లే దారిలో ఉన్న ప్రభుత్వ కాలనీలో ఇంటింటికి జెజెఎం ద్వారా పైపులైన్ వేయించాలని కోరారు.

కారాగారం సందర్శన

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మండల న్యాయ సేవాధికార కమిటీ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు కరాగారాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, తాగునీటి సౌకర్యాలు, ఆరోగ్యంగా ఉన్నవారికి అందించే వైద్య సదుపాయాలు, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సలహాలు, నిందితులకు అందించిన సహాయంపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. వంటశాల స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు.

దిశా కమిటీకి 10 మంది పేర్లు ప్రతిపాదించిన ఎంపీ

చేబ్రోలు సర్పంచి సునీతకు చోటు

ప్రజాశక్తి - ఉంగుటూరు

జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీలో (దిశా) సభ్యులుగా ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పది మందిని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రతిపాదించారు. దిశా కమిటీలో సభ్యులుగా నత్తా దివ్య దీప్తి, చీకటి కవిత, అడపా నాగలక్ష్మి, ముసునూరు లక్ష్మి, రందే లక్ష్మీసునీత, షేక్ కరీముల్లా షా ఖాదరి, జంగం వెంకటేశ్వరరావు, మొడియం సింగరాజు, పిల్లరిశెట్టి సంధ్య, ఆలూరి రమేష్ కుమార్‌లను నియమించాలని కలెక్టర్ వెట్రిసెల్వికి ఎంపీ మహేష్ కుమార్ ప్రతిపాదనలు పంపించారు. వీరిని సభ్యులుగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. కాగా కమిటీలో చోటు దక్కిన రాందే లక్ష్మీసునీత ఉంగుటూరు మండలం చేబ్రోలు పంచాయతీ సర్పంచిగా ఉన్నారు.

ఘనంగా నూకాలమ్మ జాతర

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

స్థానిక 46వ డివిజన్ పరిధిలోని కొత్తపేట శ్రీ నూకాలమ్మవారి ఆలయంలో జరుగుతున్న జాతర వహోత్సవంలో ఏలూరు ఎంపీ మహేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు ఎంపీ మహేష్‌కుమార్‌కు మంగళ వాయిద్యాలు, డప్పుల చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. ఎంపీ మహేష్ కుమార్ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, పెనుమంట్ర మండలం, నెలమూరు గ్రామానికి చెందిన కొడమంచిలి రమేష్ అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. నెలమూరు గ్రామం నుండి మోటార్ సైకిల్ పై మార్టేరు గ్రామం వెళ్తుండగా నా యొక్క **పాస్ పోర్ట్ నెం. M0551349** గల పాస్పోర్ట్ పడిపోయింది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

కొడమంచిలి రమేష్
తండ్రి : నాగేశ్వరరావు
డోర్ నెం : 3-56/1, అంబేద్కర్ వీధి,
నెలమూరు, పెనుమంట్ర మండలం,
ప.గో.జిల్లా, పిన్: 534126
సెల్: 84669 41397

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
H.M.O.P.No. 19/2024

బిట్వీన్:-
వంక సంతోష్ ...పిటీషనర్
And
వంక వెంకట ప్రత్యూష @ వాక వెంకట ప్రత్యూష
W/o. సంతోష్ కుమార్, D/o. Late వాక వెంకట సత్యనారాయణ,
R/o. Tower Street, Narasapur. ...రెస్పాండెంట్

ఈ నెంబరు Divorce O.P లో పై రెస్పాండెంటుకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను ఆమె తీసుకొనక పిటిషనరును చిక్కులు పెట్టవలెననీ దురుద్దేశ్యముతో కాలయాపన చేయుచున్నందున ఆమెకు నోటీసులు అమలు జరగనందున శ్రీ కోర్టు వారు Substitute of Service ద్వారా పేపరు ప్రకటనకు ఆర్డరు వేసి పై రెస్పాండెంటు హాజరు నిమిత్తము **ది.07-04-2025వ తేదికి** వాయిదా వేసినారు. కావున సదరు రెస్పాండెంటు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ఆరోజు **ఉదయం 10-30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఎస్. ఆనంద చక్రవర్తి బి.కాం.,బి.ఎల్
నరసాపురం అడ్వకేట్
తేది:21-03-2025 నరసాపురం
సెల్: 98491 45267

Before The Honourable Judge Prinicipal Family Court Vijayawada
F.C.O.P.No. 454/2024
Maintenance Case

Between:
Pamidi Jyotsna @ Nambari Jyotsna **...Petitioner**
And
Pamidi Hema Naga Ravi Kumar **...Respondent**

To:
The Respondent
Pamidi Hema Naga Ravi Kumar
S/o. Srinivasa Rao, 31 Years,
Software Employee, R/o. D.No. 1-85,
Putlacheruvu, Mandavalli Mandal,
Eluru Dt.- 521326.

పై నెంబరు పిటిషన్ లోని రెస్పాండెంటుకు శ్రీ కోర్టువారు సబ్ స్టిట్యూట్ సర్వీసు ద్వారా నోటీసు తీసుకొను నిమిత్తం వుత్తర్వులు జారీ చేసి యున్నారు. కావున సదరు రెస్పాండెంట్ **ది. 05-05-2025 వ తేది ఉదయం గం. 10-30 ని.లకు** పై చెప్పిన కోర్టులో స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం)

Sri. M. Samba Siva Rao
Smt. M.V.L. Gopi Ratnam
Sri. M. Koti Nagaiah
Smt. P. Sai Sree
Vijayawada Advocates,
Dt. 21-03-2025 D.No. 27-30-7, Akulavari Steet,
Governorpet, Vijayawada- 2
Cell: 99480 92920